సాక్షి అనకాపల్లి

I

బుధవారం ı 1 ı అక్టోబర్ ı 2025

అమ్మవారి నేటి అలంకారము
శ్రీ మహిషాసుర మర్దినీదేవి



న్యూస్‌రీల్

3 నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

ఆరిలోవ: డీఎస్సీ–2025 ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3వ తేదీ నుంచి 10 వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో శిక్షణ కోసం ఐదు సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 1,139 ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వారికి విశాఖ జిల్లాలో మూడు సెంటర్లు, అనకాపల్లి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. విశాఖలో చినగదిలి మండలం రుషికొండ ఐటీ సెజ్‌లో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, పెందుర్తి మండలంలో పెందుర్తి సమీపం నర్సింగ్ కళాశాల, అనకాపల్లి జిల్లాలో సబ్బవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరులో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఇప్పటికే ఇచ్చిన నియామక పత్రాలతో పాటు శిక్షణ తేదీలు, కేంద్రం కేటాయించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

నక్కపల్లిలో స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ల పర్యటన



నక్కపల్లి హాకీ క్లబ్‌లో క్రీడాకారులతో మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు ఎం.వి.రమణారావు, పేరం రవీంద్రనాథ్, కొవ్వాసు జగదీశ్వరీ బృందం సభ్యులు మంగళవారం నక్కపల్లిలో పర్యటించారు. ఇక్కడున్న హాకీ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. నక్కపల్లిలో హాకీ క్రీడాకారులకు అద్భుతమైన శిక్షణ ఇస్తున్న కోచ్‌లను అభినందిస్తున్నామన్నారు. అనంతరం బీఎస్ హాకీ క్లబ్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, మాజీ సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, కోచ్ రాంబాబు, నానాజీ, శ్రీను, రంజిత్ పాల్గొన్నారు.

జయహో దుర్గాభవానీ..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం దుర్గాష్టమిని ఘనంగా నిర్వహించారు. అమ్మవారు మహాదుర్గగా దర్శనమిచ్చారు. అష్టమి తిథిని పురస్కరించుకుని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.



అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మ



విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారికి గాజులతో అర్చన



కశింకోట కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో...

అంబేడ్కర్ 'స్మృతి'ని చెరిపేస్తారా?

- రాష్ట్రాన్ని అమ్మేస్తారా?
- కూటమి తీరుపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని డిమాండ్



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

అనకాపల్లి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, దళితులపై దాడులు, విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే యత్నాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దండ జ్ఞానదీప్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జంక్షన్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు, వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వలన పేద విద్యార్థులు మెడికల్ విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, స్మృతివనాన్ని నిర్మిస్తే ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కూటమి ప్రభుత్వం ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. పేద విద్యార్థులకు మెడికల్ విద్యను అందించాలని రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభించగా.. 7 మెడికల్ కళాశాలలు అందుబాటులోనికి వచ్చాయని, మిగిలిన 10 మెడికల్ కళాశాలలు 80 శాతం పనులు పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పీపీపీ పేరిట మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తే, కాసులకు కక్కుర్తిపడి సీఎం చంద్రబాబునాయుడు ఈ రంగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అన్యాయమన్నారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వలన రిజర్వేషన్ సౌకర్యాలు అందవని, ఎస్సీ కులస్తులు మెడికల్ విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పాలనలో దళిత కులస్తులకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతోందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల ఎస్సీ సెల్ అధ్యక్షులు పెట్ల నాగేశ్వరరావు, వంగలపూడి గణేష్, మంద రాము, 80, 84 వార్డు ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, హైమావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్

సమస్యల పరిష్కారం కోసం పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా ధర్నా చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

అనకాపల్లి: జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కనక అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదుట మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీహెచ్‌సీ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బాండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. నోషనల్ ఇన్‌క్రిమెట్స్ మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రొగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేలు అలవెన్స్ అందజేయాలని, నేటివిట్, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినోద్, వెంకటేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి బియ్యం పంపిణీ

బుచ్చెయ్యపేట: మండలంలో రాజాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మరిశా సన్యాసినాయుడికి అధికారులు ఇంటి వద్దే రేషన్ బియ్యం అందించారు. రెండు కళ్లూ లేని సన్యాసినాయుడు, 80 ఏళ్ల వృద్ధురాలైన అతని తల్లికి రెండు నెలలుగా రేషన్ సరకులు అందడం లేదు. రేషన్ డీలర్ ఇంటికి తీసికొచ్చి రేషన్ సరకులు పంపిణీ చేయకపోవడంపై అధికార్లకు దివ్యాంగుడు సన్యాసినాయుడు సోమవారం ఫిర్యాదు చేశారు. పత్రికల్లో వచ్చిన కథనాలతో తహసీల్దార్ లక్ష్మి మంగళవారం వీఆర్వో అఖిల్ ద్వారా సన్యాసినాయుడికి, అతని తల్లికి రేషన్ బియ్యం , సరుకులు అందించారు. సన్యాసినాయుడు తల్లి వయస్సు రేషన్ కార్డులో తక్కువగా నమోదవడంతో ఆమె వయస్సు మార్పు చేయిస్తామని తహసీల్దార్ తెలిపారు.



దివ్యాంగుడు సన్యాసినాయుడికి ఇంటి వద్ద బియ్యం అందిస్తున్న వీఆర్వో అఖిల్

అమ్మో.. బస్సు ఎక్కలేం!

ఆర్టీసీపై దసరా ప్రభావం • రద్దీకి తగ్గట్టు బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు • ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణాలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న జనం

సాక్షి, అనకాపల్లి/అనకాపల్లి టౌన్: దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల తాకిడి పెరగడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. సొంతూళ్లకు వెళ్లే వారితో బస్టాండ్‌లు రద్దీగా మారాయి. ప్రస్తుతం ఉన్న ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రత్యేక సర్వీసుల కింద హైదరాబాద్, విజయవాడకు నడపడంతో లోకల్ సర్వీస్ బస్సులు మరింత రద్దీగా మారాయి. మరోవైపు స్త్రీశక్తి పథకం అమలు తర్వాత మహిళా ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు అదనపు బస్సు సర్వీసులను నడపడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి శాపంగా మారింది. మహిళలు ఉచిత పథకం ద్వారా ప్రయాణించడానికి వేచి ఉన్నా .. బస్సులు రద్దీగా ఉండడంతో ప్రైవేట్ వాహనాల్లోనే డబ్బులు చెల్లించుకుని వెళ్లే పేరిస్థితులు నెలకొన్నాయి. దసరా పండగ సందర్భంగా ప్రైవేట్ బస్సులు, వాహనాల్లో టికెట్ రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. అయినా తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ సర్వీసుల్లోనే ప్రయాణికులు వెళ్తున్నారు.

అరకొర బస్సులతో అవస్థలు

అనకాపల్లి నుంచి ఎక్కువగా విశాఖపట్నం, విజయనగరం, గాజువాక ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే గ్రామీణ ప్రాంతాలైన పాయకరావుపేట, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల, రావికమతం, తంతడి, పూడిమాడక, వై.లోవ, వెంకటాపురం తదితర గ్రామాల నుంచి అనకాపల్లికి నిత్యం ప్రజలు ప్రయాణిస్తుంటారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే సమీపంలోని బైపాస్ రోడ్‌కు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుకుంటారు. అరకొర బస్సు సర్వీసులతో ఇప్పటికే అవస్థలు పడుతున్న ప్రయాణికులకు ఇక దసరా పండగకు ఊరెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. బస్సులో సీటు దొరికిందంటే లాటరీ తగిలినట్టు ఫీలైపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పండగ నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో పిల్లలతో సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. బస్సు ప్రయాణం ఉచితం కావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగింది. అయితే సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడంతో సీట్ల కోసం ఫీట్లు తప్పడం లేదు. నిల్చునే ప్రయాణాలు సాగిస్తున్నారు. గమ్యస్థానాలకు చేరాలని మహిళలు సైతం ఫుట్‌పాత్‌లపైనే ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు.

జిల్లాలో బస్సు సర్వీసుల వివరాలు

అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంకు సూపర్ లగ్జరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రత్యేక సర్వీసులుగా మార్చారు. అనకాపల్లి డిపోలో 90 బస్సులు ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు 4, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 18, సిటీ ఆర్డనరీ 4, పల్లెవెలుగు 64 బస్సులున్నాయి. దసరా సందర్భంగా అనకాపల్లి నుంచి 20 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. వీటిని పాయకరావుపేట, చోడవరం, నర్సీపట్నం, విజయనగరం మార్గాల్లో నడుపుతున్నారు. నర్సీపట్నం డిపోకు కూడా అదనంగా 20 స్పెషల్ సర్వీసులు పెంచారు. ఇందులో విశాఖ–నర్సీపట్నం 10, విజయవాడకు–2, హైదరాబాద్–1, మిగిలిన 7 బస్సులు లోకల్ సర్వీసులకు కేటాయించారు. దీనిపై ఆర్టీసీ అనకాపల్లి డిపో అధికారి ప్రవీణను సంప్రదించగా.. దసరా నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. రద్దీకి తగ్గట్టు ప్రత్యేక సర్వీసులను పెంచామని చెప్పారు. ముందస్తుగా బుక్ చేసుకుంటే భవానీ భక్తులకు ఎక్స్‌ప్రెస్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో అందుకు తగ్గట్టు బస్సులను సర్దుబాటు చేస్తున్నామన్నారు.

గంటల తరబడి నిరీక్షించాల్సిందే



దసరా పండగ నేపథ్యంలో బస్సులు కిటకిటలాడుతున్నాయి. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. రద్దీ పెరిగిపోవడంతో బస్సులు ఆలస్యంగా నడుస్తున్నాయి. బస్సు ఎక్కే సమయంలో కూడా తోపులాటలు చోటు చేసుకుంటున్నాయి. దసరా వరకు పోలీసుల సమక్షంలో క్యూలో బస్ ఎక్కే విధంగా ఏర్పాట్లు చేయాలి.

– ఆర్.మంగనాయుడు, కొత్తపేట

ప్రైవేట్ సర్వీసులే దిక్కు..



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో సొంత గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్ సర్వీసులే దిక్కవుతున్నాయి. ఆటోలు, టాటా మేజిక్, ఇతర సర్వీసుల డ్రైవర్లు డబుల్ చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. అదనపు సర్వీసులను నడుపుతున్నట్టు కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువగా బస్సులు నడపాలి.

– గొనగాన చిన్నోడు, తట్టబంద

గతమెంతో ఘనం.. నేడు జ్ఞాపకం

మాడుగుల కోట.. దసరా ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించిన సంస్థానం. గుర్రపు స్వారీ చేసి, కత్తి తిప్పే సాహసవీరులకు.. వేడుకలకు శోభ చేకూర్చే కళాకారులకు ఆలవాలం. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడి సందడిని ఆస్వాదించేవారు. కథలు కథలుగా చెప్పుకునేవారు. కానీ అదంతా గత వైభవం.. గతించి'పోయిన' బంగారు కాలం. ఇప్పడవన్నీ జ్ఞాపకాలుగా మిగిలాయి. కానీ ఇప్పటికీ దసరా వేడుకల్లో నాటి చిహ్నాలు కనిపిస్తున్నాయి.

- మాడుగుల సంస్థానంలో దసరా వేడుకలకు ఎంతో విశిష్టత
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి సందర్శకులు తిలకించిన చరిత్ర
- నాటి సందడి కనుమరుగైనా నేటికీ కొనసాగుతున్న సంప్రదాయాలు
- సివిల్, ఆర్టీసీ, ఆటో మోటారు యూనియన్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు



బంగారు, వెండి ఆభరణాలతో వెలిగిపోతున్న మాడుగులలోని దేవీ తల్లి



మాడుగుల మత్స్యవంశ రాజులు యుద్ధ సమయంలో వాడిన ఆయుధాలు



దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి కత్తిసాము ప్రదర్శన

మాడుగుల: మాడుగుల కోట ఒకనాటి జయపూర్ సంస్థానంలోనిది. విజయదశమి వేడుకలకు వేదికగా నిలిచింది. మహరాజుల కాలంలో దేశ విదేశాల నుంచి కళాకారులు వచ్చేవారు. ఇతర రాజవంశాలకు చెందిన యువరాజులు వచ్చి ఇక్కడ కోట ప్రాంగణంలో నిర్వహించే చిత్ర విచిత్ర కత్తి, కర్ర సాములు, గుర్రపు పందాలు తిలకించేవారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. యుద్ధాలలో వాడే ఆయుధాలతో జమ్మి చెట్టు నరికి దేవీ తల్లీ ఆలయంలో పూజలు నిర్వహించేవారు. ఇలా నిర్వహించడం వలన యుద్ధాలలో విజయం వరిస్తుందని అప్పటి మహరాజుల నమ్మకం. యుద్ధ విద్యల్లో తర్ఫీదు పొందడానికి మాడుగుల పట్టణంలో కోట చుట్టూరా జగన్నసావిడి, రాజులు సావిడీలతోపాటు ఐదు సావిడులు ఉండేవి. నాటి సంప్రదాయాలను సివిల్, ఆర్టీసీ, ఆటో మోటారు యూనియన్ వారు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. బస్సు యజమానులతో పాటు వాటిలో పనిచేసే డ్రైవర్లు పుప్పాల నారాయణమూర్తి, దేవరాపల్లి నారాయణ, ఇల్లపు గంగునాయుడు, బోర కాళిదాసు నేడు కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ఎస్‌పీఎల్ రమణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు కొనసాగాయి. అతని అనంతరం కుక్కర మోదకొండ, ద్రాక్షారపు త్రినాథ్‌లు నిర్వహించారు. ప్రస్తుతం ఆర్టీసీ, ఆటో మోటార్ యూనియన్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అదే సంప్రదాయాలతో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలుత పాత బస్టాండ్‌లో దేవీ తల్లి తాటాకుల పాకలో కొలువై ఉండేది. అంచలంచెలుగా ఆలయంతోపాటు మండపాల నిర్మాణం చేపట్టారు. అలనాటి మాడుగుల మహరాజులు యుద్ధాలలో వాడిన కత్తులను ఈనాటికీ తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. దసరా రోజు వాటిని శుభ్రపరిచి దేవీ ఆలయంలో పూజలు అనంతరం కోట మీదుగా సంబరాలు చేసుకుంటూ తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి చేరుస్తారు.

అంతరించిపోయిన గుర్రాల సంత



దసరా రోజున మాడుగులలో గుర్రాల సంత జరిగేది. దేశంలో హంపీ విజయనగరం తర్వాత మాడుగులలోనే గుర్రాల సంత జరిగేది. యుద్ధానికి పనికి వచ్చే కావ్వాడ్, సుడేధార్ రేస్ తదితర ఖరీదైన గుర్రాలు మాడుగులకు వచ్చేవి. రాజుల పాలన ముగిసినా సరే అదే సంప్రదాయంతో గుర్రాల క్రయ విక్రయాలు జరిగేవి. దసరా ముందు మూడు రోజు వెనుక రెండు రోజులు ఐదు రోజులు సంత జరిగేది. బరువులు మోసే గుర్రాలు వేలాది సంఖ్యలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చేవి. విశాఖ ఏజెన్సీకి రహదారులు లేని సమయంలో వీటిని ఏజెన్సీ పంటలను దిగువకు తరలించడానికి వినియోగించేవారు. రోడ్లు నిర్మించి, బస్సులు ఇతర వాహనాలు అందుబాటులోకి రావడంతో గుర్రాల వాడకం తగ్గిపోయింది. గత మూడేళ్ల నుంచి గుర్రాల సంత జరగడం లేదు.

వంశపారంపర్యంగా కత్తిసాము



మాడుగుల దసరా ఉత్సవాలలో మహరాజుల కాలం నుంచి మా ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి కత్తి సాము కర్ర, సాములు ప్రదర్శనలు ఇస్తున్నాము. యుద్ధాలలో విజయం సాధించే విధంగా తర్ఫీదు ఇచ్చేవారని మా తాతలు చెబుతుండేవారు. ప్రస్తుతం ఐదుగురం మాత్రమే ఉన్నాము. ఆనాటి రాజులు వాడిన కత్తుల తోనే సాము తిప్పుతున్నాము.

–ఆది చినరాజబాబు, కత్తి సాము కళాకారుడు, మాడుగుల

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీ యాచకుడు దుర్మరణం



మర్రిబంద హైవే కూడలి సమీపంలో యాచకుడు మృతదేహం

యలమంచిలి రూరల్: మండలంలోని మర్రిబంద హైవే కూడలికి సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ కూడలిలో ఫ్లిప్‌కార్ట్ కార్యాలయం వద్ద 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉన్న బిచ్చగాడు నడిచి వెళ్తుండగా, అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రేగుపాలెం వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్సై కే సావిత్రి తెలిపారు.

ఉపాధ్యాయిని బంగారు గొలుసు మాయం

పట్టణ పోలీసులకు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని పట్టణ పోలీసులకు ఉపాధ్యాయిని ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని పూడిమడక రోడ్డులో గ్రీన్ హీల్స్ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న కె. విమలాదేవి అచ్యుతాపురం జెడ్పీహెచ్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 16న ఉదయం స్కూల్‌కు బయలుదేరే క్రమంలో పడక గదిలో రెండున్నర తులాలు నల్లపూసలు గొలుసు మరిచిపోయింది. సాయంత్రం స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా, గొలుసు కనిపించలేదు. దాంతో ఇంట్లో పనిచేస్తున్న మహిళపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి వన్యప్రాణి వారోత్సవాలు



ఆరిలోవ: ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కులో గురువారం నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు క్యూరేటర్ జి. మంగమ్మ మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు, ప్రజల కోసం వివిధ పోటీలు నిర్వహించనున్నారు. వీటిలో బర్డ్‌వాక్, ఫొటోగ్రఫీ, రేఖాచిత్ర పోటీలు, ప్రసంగ పోటీలు వంటివి ఉన్నాయి. పోటీల్లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందజేస్తారు. మరిన్ని వివరాల కోసం జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ 78936 32900 నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

వాణిజ్యాన్ని గాలికొదిలేశారు

- కీలక పోస్టుల భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం కినుక
- జేసీ-1, ఇద్దరు డీసీలు, ఇద్దరు సీటీవోల కుర్చీల ఖాళీ
- ఏడాది కాలంగా జేసీ-1 పోస్టును భర్తీ చెయ్యకుండా నిర్లక్ష్యం
- ఐదుగురి పని భారం మొత్తం జేసీ-2పైనే..
- అయినా పట్టించుకోని ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అత్యధిక ఆదాయాన్ని అందించే రెండో డివిజన్. చంద్రబాబు పదే పదే ఆర్థిక రాజధాని నగరమని చెప్పే ప్రాంతం.. దీనికి తోడు.. కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల అమలు కసరత్తులు.. ఇలా.. నిరంతర పనిభారం ఉన్న డివిజన్‌పై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోంది. అత్యంత కీలకమైన వాణిజ్య పన్నుల డివిజన్ ప్రధాన కార్యాలయంలో ప్రధాన పోస్టుల భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మూడు నెలలుగా.. ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో కార్యాలయంలో జాయింట్ కమిషనర్ సహా ప్రతి ఒక్కరిపైనా పనిభారం పెరిగిపోతోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు విశాఖ డివిజన్ పరిధిలోకి వస్తాయి. విశాఖ జిల్లాని మొత్తం 8 సర్కిల్స్‌గా విభజించి జీఎస్టీ వసూలు చేసేవారు. విశాఖ మహా నగర పరిధిలో మొత్తం 7 సర్కిల్స్, రూరల్ జిల్లాలోని మండలాలన్నీ కలిపి ఒక సర్కిల్ (అనకాపల్లి) మొత్తం 8 సర్కిల్స్ పరిధిలో 42 వేల మంది డీలర్స్ నుంచి పన్ను వసూళ్లు జరిగేవి. అయితే విశాఖ జిల్లాను మూడు జిల్లాలుగా రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. ఈ నేపథ్యంలో డివిజన్‌లో ఉన్న ఎనిమిది సర్కిల్స్‌ని 14 సర్కిల్స్‌గా విభజించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తాన్ని ఒక సర్కిల్‌గా ఏర్పాటు చేసి దీనికి పాడేరు సర్కిల్ అని పేరుని సూచించారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లాను రెండు సర్కిల్స్‌గా విభజించారు. ఒకటి అనకాపల్లి సర్కిల్, రెండు అచ్యుతాపురం సర్కిల్‌గా నామకరణం చేశారు. ఇక మిగిలిన విశాఖ జిల్లాను మొత్తం 11 సర్కిల్స్‌గా విభజించారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఉన్న వార్డులతో పాటు జిల్లా పరిధిలో ఉన్న ఆనందపురం, భీమిలి మండలాల్ని కలుపుకొని విభజన చేపట్టారు. కొత్తగా భీమిలి, మాధవధార, ఎయిర్‌పోర్టు సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. వీటికితోడుగా గాజువాక, సిరిపురం, కురుపాం, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, సిరిపురం, చినవాల్తేరు, స్టీల్‌ప్లాంట్ సర్కిల్స్‌గా విభజించారు. ప్రస్తుతం ఉన్న గాజువాక సర్కిల్‌ని గాజువాక, ఎయిర్‌పోర్టుగా విభజించారు. ప్రతి సర్కిల్ నుంచి దాదాపు సమాన ఆదాయం వచ్చేలా సర్దుబాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకూ అధికారుల నియామకాలు సక్రమంగా నిర్వహించారు. కూటమి వచ్చిన తర్వాత డివిజన్‌ని గాలికొదిలేసింది.

ఏడాదికి పైగా ముక్కుతూ మూలుగుతూ..

డివిజన్ విభజన సమయంలో జాయింట్ కమిషనర్ పోస్టులను రెండుగా విభజించారు. జేసీ-1గా ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2023లో జేసీ-1గా ఓ.ఆనంద్ వ్యవహరించారు. జేసీ-2గా సుధాకర్ విధులు నిర్వర్తించారు. ఆనంద్‌ని 2024 ఎన్నికల తర్వాత బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌ను నియమించలేదు. జేసీ-2గా సుధాకర్ స్థానంలో కిరణ్‌కుమార్‌ని నియమించారు. మూడు నెలల క్రితం జేసీ-2గా కిరణ్‌కుమార్ స్థానంలో శేషాద్రిని నియమించారు. కానీ.. జేసీ-1 నియామకం విషయంలో నిర్లక్ష్యం వహించారు. ఇప్పటి వరకూ జేసీ-1తో పాటు ఆయన విభాగంలో పనిచేసే మిగిలిన అదికారుల నియామకంపైనా కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. జేసీ-1తో పాటు.. డిప్యూటీ కమిషనర్-1, డిప్యూటీ కమిషనర్-2, నలుగురు అసిస్టెంట్ కమిషనర్లు(సీటీవోలు) పోస్టుల్లో విధులు నిర్వర్తించిన వారిని మూడు నెలల క్రితం బదిలీ చేసి వారి స్థానాల్ని ఇంతవరకూ భర్తీ చెయ్యలేదు. దీంతో జేసీ-1 పరిధిలో ఉన్న ఐదుగురు అధికారులు నిర్వర్తించే విధులన్నీ ఒకే అధికారిపై భారం పడింది. దీంతో వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ కార్యాలయంలో ఫైళ్లు భారంగా కదులుతున్నాయి. జీఎస్టీ సంస్కరణలు వచ్చిన తర్వాత పని ఒత్తిడి మరింత పెరిగింది. దీంతో జేసీ-2తో పాటు ఇతర విభాగాల్లో ఉన్న అందరు ఉద్యోగులు నిరంతరం పనిచెయ్యాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులకు వారాంతపు సెలవులు కూడా లేకుండా పనిచేస్తున్నారనీ.. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చెయ్యాలని అసోసియేషన్లు ప్రభుత్వానికి పదే పదే నివేదించినా ఎలాంటి స్పందన లేదు. దీంతో.. అతి పెద్ద డివిజన్‌లో పనుల నిర్వహణ ఒత్తిడితో ఉద్యోగులు, అధికారులు సతమతమవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తక్షణమే అధికారుల పోస్టులు భర్తీ చెయ్యాలని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బల్క్ డ్రగ్స్ పార్క్‌పై తగ్గేదేలే..

రద్దు చేసే వరకూ దీక్షలు కొనసాగిస్తామన్న గంగపుత్రులు



దీక్షలు కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని మత్స్యకారులు ఘంటాపథంగా చెప్పారు. రాజయ్యపేటలో వీరు చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. వారితో పాటు నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, పార్టీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా నాయకుడు ఎం అప్పలరాజు దీక్ష చేశారు. అనంతరం నాయకులు, మత్స్యకారులు మాట్లాడుతూ రెండు వారాలకు పైగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వంలో చలనం లేదన్నారు. పనులు అడ్డుకుంటే హోంమంత్రి స్పందించారన్నారు. ఉప్పాడలో దివీస్ కంపెనీ, రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ పెడుతూ గంగపుత్రులు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రాణాలకు హాని కలిగించే కంపెనీ కాకినాడ జిల్లాలో అడ్డుకుంటే, రాజయ్యపేటలో ఏర్పాటు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన అనిత బల్క్ డ్రగ్స్ పార్క్‌ను వ్యతిరేకిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక కంపెనీలకు అనుకూలంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సోమవారం గ్రామంలో చర్చలు కోసం వచ్చిన అనితకు తమ వైఖరి స్పష్టం చేశామన్నారు. కమిటీ ఏర్పాటు చేస్తాం, సీఎంతో మాట్లాడుతామంటే కుదరదన్నారు. బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలని ప్రకటన చేసే వరకు దీక్ష ఆగదన్నారు. తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గంగపుత్రుల సహనాన్ని పరీక్షిస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. కూటమి నాయకులుకు మత్స్యకారుల ఓట్లు కావాలని, ప్రాణాలు అక్కర్లేదా అని మండిపడ్డారు. మండలంలో ఎక్కడా లేనివిధంగా రాజయ్యపేటలో టీడీపీకి రెండు వేల మెజారిటీ ఇస్తే, తమ గ్రామస్తుల ప్రాణాలకే ముప్పు తెచ్చే కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. తమ డిమాండ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లే వరకు పనులు ఆపిస్తామని మంత్రి అనిత హామీ ఇచ్చారని, అయినప్పటికీ ఇసుక లారీలు రావడంతో ఆగ్రహం చెందిన ఆందోళన కారులు వాటిని అడ్డుకున్నారన్నారు. మత్స్యకారులు దీక్షను మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాలని కంబాల జోగులును కోరగా సానుకూలంగా స్పందించారు. మత్స్యకారుల దీక్షపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక ప్రకటన చేయాలని జోగులు కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, సూరకాసులు గోవిందు, పన్నీరు బాబ్జి, గొర్ల గోవిందు, ఎం.అప్పలరాజు, ఎరిపల్లి నగేష్, మునలయ్య, మహేష్, పిక్కి తాతీలు, గెడ్డమూరి శ్రీను, సోమేష్, నూకరాజు, అప్పలరాజు పైడితల్లి, బాబూరావు, పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ హబ్‌గా విశాఖ!

విశాఖ స్పోర్ట్స్: స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటు కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రతినిధులు మంగళవారం విశాఖలోని క్రీడా వసతులను పరిశీలించారు. కొమ్మాదిలోని సమీకృత స్టేడియం, గాజువాక, గోపాలపట్నంలోని శాప్ ఇండోర్ హాల్‌లను నలుగురు సభ్యుల బృందం సందర్శించింది. ప్రస్తుతం ఉన్న వసతులు, అకాడమీల ఏర్పాటుకు అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలపై ఈ బృందం త్వరలోనే ప్రభుత్వా నికి నివేదిక సమర్పించనుంది. రాష్ట్రంలో బాల బాలికలకు ఏయే ప్రాంతాల్లో, ఏయే క్రీడలకు అవసరమైన సదుపాయాలు, అకాడమీలు ఏర్పాటు చేయాలనే అంశంపై రెండు బృందాలు విశాఖ, కాకినాడ, నెల్లూరు, తిరుపతిలో అధ్యయనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా శాప్ బృందంలోని సభ్యులు ఎ. రమణారావు, బుచ్చిరాజు, జగదీశ్వరి, రవీంద్ర మాట్లాడారు. వాటర్ స్పోర్ట్స్‌కు విశాఖపట్నాన్ని హబ్‌గా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలు, టూరిజం అభివృద్ధికి అవసరమయ్యే వసతులపైనా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత



బాధితురాలికి మొబైల్ అందించిన ఎస్‌ఐ తారకేశ్వరరావు, పక్కన క్రైమ్ కానిస్టేబుల్ కిశోర్

నాతవరం: ఆర్టీసీ బస్సు ప్రయాణంలో పోగొట్టుకున్న మొబైల్‌ను స్థానిక పోలీసు స్టేషన్లో బాధితురాలికి అందజేసినట్టు ఎస్‌ఐ వై. తారకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... నాతవరం గ్రామానికి చెందిన లక్కోజు మాధవి తన పిల్లలతో కలిసి రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సులో నర్సీపట్నం వెళ్తుండగా రూ. 25 వేలు విలువ చేసే మొబైల్‌ను పోగొట్టుకుంది. ఈ విషయమై వెంటనే ఆమె నాతవరం ఎస్‌ఐకు సమాచారం ఇచ్చింది. నాతవరం క్రైమ్ కానిస్టేబుల్ పి.కిశోర్ అనకాపల్లి జిల్లా పోలీసు టెక్నికల్ టీమ్‌తో కలిసి పోగొట్టుకున్న మొబైల్ ప్రాంతాన్ని గుర్తించారు. బాధితురాలు అన్నయ్య దుర్గాప్రసాద్‌తో కలిసి కాకినాడ జిల్లా తుని మండలం నందిపూడిలో ఒక వ్యక్తి నుంచి మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని బాధితురాలికి అప్పగించారు. గంటల వ్యవధిలో మొబైల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్న క్రైమ్ కానిస్టేబుల్ కిశోర్‌ను ఎస్‌ఐ అభినందించారు.

తోడపెద్దుకు కన్నీటి వీడ్కోలు



సేవ గరిడీ కళాకారులు



తోడ పెద్దును ఊరేగిస్తున్న దృశ్యం

మునగపాక: నందీశ్వరుడిగా.. సింహాద్రప్పన్నగా ఆరాధించే తోడపెద్దు సోమవారం రాత్రి కన్నుమూసింది. మునగపాకలో ఆడారి జగ్గప్పకు చెందిన ఈ తోడపెద్దు అనారోగ్యానికి గురైంది. కొద్ది రోజులుగా వైద్య సేవలందించినా ఫలితం లేకుండా పోయింది. మునగపాక ఆస్పత్రి రోడ్డు నుంచి గ్రామంలో పలు సేవ గరిడీలతో అంతిమయాత్ర నిర్వహించారు. ఈ ఊరేగింపు యాత్రలో గ్రామస్తులు గోవిందా..గోవిందా అంటూ నామస్మరణతో తోడపెద్దుకు చేతులు జోడించి దండాలు పెడుతూ కన్నీటి వీడ్కోలు పలికారు. అనంతరం నందీశ్వర కళా ప్రాంగణం దరి పాన్పు చేపట్టారు.

తల్లిని మించిన తనయ సాహితి



తల్లి నాగజ్యోతి, కుమార్తె సాహితీలను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

రోలుగుంట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ పీవీఎం నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహస బాలిక అవార్డు గ్రహీత సాహితీలను నర్సీపట్నంలోని వాసవీ క్లబ్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో క్లబ్ రీజినల్ చైర్మన్ వెలగా నారాయణ దంపతులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ నాగజ్యోతికి రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఆమె కుమార్తె సాహితీ తల్లిని మించిన తనయగా స్విమ్మింగ్‌లో అనేక పురస్కారాలు పొందారన్నారు. రేవు పోలవరంలో తీరంలో ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడి సాహస బాలిక అవార్డు పొందడం ఆర్యవైశ్య వర్గానికే గర్వకారణమన్నారు. వాసవీ క్లబ్ అభివృద్ధికి తాము అన్ని రకాలుగా సహకరిస్తామని ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు తెలిపారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా వచ్చేనెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు చందోలు వెంకటేశ్వరులు తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన ఎఫ్‌ఏపీటీవో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలని, మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు చేయాలని, సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఆర్థిక బకాయిల చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా తమ సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించలేదన్నారు. ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ. 30వేల కోట్ల బకాయిల రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకూ స్పందన లేదన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యుటీ తదితరాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని చెప్పారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పదించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. అనంతరం పోరుబాట ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కో చైర్మన్ ఆళ్ల శేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్.దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎ.వి.హెచ్. శాస్త్రి, మట్ట శ్రీనివాసరావు, జె.రాజేష్, వై.శ్రీనివాసారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అలోక్ మెహ్రాకి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ మెహ్రా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను సూపరింటిండెంట్ వెంకటేశ్వరరావు అందజేశారు.

సింహాచలం దేవస్థానానికి బ్యాటరీ కారు అందజేత



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ బ్యాటరీ కారును వితరణగా అందజేసింది.సుమారు రూ. 8 లక్షలు విలువ చేసే ఈ బ్యాటరీ కారును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఎమ్‌వో శంకర్ సుబ్రహ్మణ్యం సింహగిరిపై దేవస్థానం అధికారులకు అందజేశారు. అనంతరం దేవస్థానం అర్చకులు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో తిరుమలేశ్వరరావు, అధికారులు, కోరమాండల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఈటీఏతో అదనపు ప్రయోజనాలు

కస్టమ్స్ కమిషనర్ శ్రీధర్

ఏయూక్యాంపస్: భారత్-యూకేల మధ్య ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సీఈటీఏ)పై విశాఖ ప్రత్యేక ఆర్థిక మండలి(వీఎస్‌ఈజెడ్) ఆధ్వర్యంలో నోవాటెల్‌లో మంగళవారం ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్‌ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల సీఈటీఏ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రూల్ ఆఫ్ ఆరిజిన్, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, సేవల కోసం మార్కెట్ యాక్సెస్, వస్తువులకు సుంకం లేని యాక్సెస్ వంటి కీలక అంశాలను వివరించారు. జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి కోరాటి మాట్లాడుతూ ఎగుమతిదారుల్లో అవగాహన పెంచడానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ భారత్-యూకే సీఈటీఏ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఎగుమతిదారులకు లభించే ప్రత్యేక ప్రయోజనాలను వివరించారు. రాయల్‌బరో ఆఫ్ కెన్సింగ్టన్(లండన్) డిప్యూటీ మేయర్ అరీస్ ఉదయ్ ఆరేటి మాట్లాడుతూ భారతీయ ఎగుమతిదారులు వ్యవసాయ, ఆహార శుద్ధి రంగాల్లో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నూతన ఒప్పందంతో రెండు దేశాలకు మేలు జరుగుతుందన్నారు. వీఎస్‌ఈజెడ్ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.వి.శివప్రసాద్‌రెడ్డి 'భారతీయ ఎగుమతిదారులకు అవకాశాలు' అనే అంశంపై ప్రసంగించారు. శ్రావణ్ షిప్పింగ్ ఎండీ జి. సాంబశివరావు, ఈపీసీఈఎస్ చైర్మన్ శ్రీకాంత్ బడిత తమ ఆలోచనలను పంచుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

అనకాపల్లి టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువును వచ్చేనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు కె.వి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఈ.ఎపి.జీవోవి.ఇన్. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు నమోదు చేసిన దరఖాస్తు ఫారాలు, ప్రవేశ పరీక్ష రుసుం వివరాల కాపీలను జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో అక్టోబర్ 18వ తేదీలోగా సమర్పించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ 7వ తరగతిలో 55 శాతం (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం) మార్కులు సాధించి, సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న వారు ఈ పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 100, ఎస్టీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుం చెల్లించాలని, పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్ సైట్ లేదా జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ట్రయాంగిల్ వివాహేతర స్టోరీ

- రైల్వే ఉద్యోగుల మధ్య వివాహేతర సంబంధం
- అందులో ఒకరు.. మరో ఇద్దరిపై చాకుతో దాడి
- తొలుత దోపిడీ కేసుగా నమోదు
- దర్యాప్తులో వెలుగులోకి అసలు విషయం

గోపాలపట్నం: రైల్వే ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాహేతర సంబంధం చివరికి చాకుపోట్లకు దారితీసింది. తనతో సంబంధం కొనసాగిస్తున్న మహిళ మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని భరించలేని ఒక ఉద్యోగి ఈ దాడికి పాల్పడ్డాడు. తొలుత దోపిడీ కేసుగా నమోదైన ఈ ఘటన.. పోలీసుల దర్యాప్తులో వివాహేతర సంబంధమే అసలు కారణంగా తేలడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసుకు సంబంధించి గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, గణపతి నగర్‌లోని ఒక రెసిడెన్సీలో నివాసముంటున్న చంద్రకళ(రైల్వే ఉద్యోగి) భర్త మరణానంతరం ఉద్యోగం పొందింది. ఆమెకు రైల్వే మెకానికల్ విభాగంలో పని చేసే ఏనుగుల నాగరాజుతో వివాహేతర సంబంధం ఉంది. శనివారం రాత్రి నాగరాజు చంద్రకళ ఇంటికి వచ్చాడు. రాత్రి అక్కడే ఉన్నాడు. అయితే, చంద్రకళ మరొకరితో సంబంధం కొనసాగిస్తోందని అనుమానం పెంచుకున్న నాగరాజు.. మధ్య రాత్రి తాను వెళ్లిపోతున్నానని చెప్పి.. అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై దాక్కున్నాడు. నాగరాజు వెళ్లిపోయాడని భావించిన చంద్రకళ.. లోకో పైలెట్‌గా పనిచేస్తున్న గౌరి నాయుడును తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తీసుకువచ్చింది. కొద్దిసేపటి తర్వాత, మేడపై దాగి ఉన్న నాగరాజు ఆమె ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై ఇంట్లో ఉన్న చాకుతో దాడి చేశాడు. ఈ దాడిలో గౌరి నాయుడు, చంద్రకళ ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే ముగ్గురూ చంద్రకళ కారులో బయలుదేరగా.. నాగరాజు గోపాలపట్నంలో దిగిపోయాడు. గౌరి నాయుడు, చంద్రకళ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేరారు.

దోపిడీగా నమ్మించే ప్రయత్నం

ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గాయపడిన గౌరి నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తాను ఉత్తర సింహాచలం నుంచి డ్యూటీ దిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారని పేర్కొన్నాడు. బంగారు చైన్, డబ్బులు అడిగారని, నిరాకరించడంతో కత్తితో దాడి చేశారని చెప్పాడు. దీంతో గోపాలపట్నం పోలీసులు తొలుత దోపిడీ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే లోతుగా దర్యాప్తు చేయగా.. అసలు దాడికి కారణం రైల్వే ఉద్యోగుల మధ్య ఉన్న వివాహేతర సంబంధమేనని తేలింది. రహస్యం బయటపడకుండా ఉండేందుకే బాధితులు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసులో వాస్తవం బయటపడటంతో నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నాగరాజును రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

భవానీ భక్తులకు సత్కారం



భవానీ భక్తులకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని కాలినడకన వెళ్లి దర్శించుకుని వచ్చిన భవానీ భక్తులను మంగళవారం ఇక్కడ సన్మానించారు. తాళ్లపాలెం రామాలయం వద్ద దుర్గాదేవి మండపంలో భవానీ భక్తులు ప్రగడ నాగేశ్వరరావు, లక్కు శ్రీనివాసరావులను మండల కో–ఆప్షన్ సభ్యుడు అద్దంకి సతీష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. భవానీ భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ లేక ఇబ్బందులు

అనకాపల్లి టౌన్: మండల కార్యాలయంలో మూడు నెలలుగా తహసీల్దార్ లేకపోవడంతో పనులు నిలిచిపోయాయని సీపీఐ నేత వైఎస్ భద్రం మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ హోదాలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ శాంతి భూషణ్‌రావు తరచూ హైకోర్టుకు వెళ్లడంతో రెవెన్యూపరమైన సమస్యలపై వచ్చిన వారు, సర్టిఫికెట్లు కోసం వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇన్‌చార్జితో సరిపెట్టకుండా శాశ్వతంగా తహసీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు మంగళవారం కూడా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఆరోగ్య సిబ్బంది కొంతమంది సాధారణ రోగులను తనిఖీ చేసి మందులు అందజేశారు.

నేడు ఖాదీ సంత ప్రారంభం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్‌రోడ్ గవర్నమెంట్ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఖాదీ సంత, రసాయన రహిత బెల్లంతో తయారు చేసిన ఉత్పత్తులు అమ్మే స్టాల్‌ను ప్రారంభిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడంలో భాగంగా ఖాదీ వస్త్రాలు, అనూష ఆగ్రో ప్రొడక్ట్స్ వారి బెల్లం పొడి, పల్లీ, నువ్వుల చిక్కీలు, మిల్లెట్స్ వంటి ప్రొడక్ట్ విక్రయిస్తారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానా



ద్విచక్ర వాహనదారును బ్రీత్ ఎన్‌లైజర్‌తో చెక్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనకాపల్లి టౌన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపినా, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసినా, హెల్మెట్ ధరించకపోయినా జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 103 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,940
రెండో రకం	4,300	4,340
మూడోరకం	3,760	3,760

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

ప్రణాళిక లోపం.. రైతులకు శాపం



- వెంకుపాలెం – కుంచంగి రోడ్డు ఎత్తుపై ఆందోళన
- ఏటా నీట మునుగుతున్న పొలాలు
- 4 అడుగుల ఎత్తు తగ్గించాలని రైతుల వినతి
- సీసీరోడ్డు నిర్మించకపోతే రోడ్డుపైకి వర్షపు నీరు



వర్షాలతో ముంపునకు గురవుతున్న వెంకుపాలెం పొలాలు

తుమ్మపాల: అధికారుల ప్రణాళిక లోపం రైతులకు శాపంగా మారింది. దశాబ్దాలుగా రోడ్డుపై రోడ్డు వేసుకుంటూ పోవడమేగానీ దీనికి ఇరువైపులా పొలాల్లో నీరుపోయేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూపలేదు. పర్యవసానంగా ఏటా నాలుగు గ్రామాల్లో పంట పొలాలు నీట ముంపునకు గురవుతున్నాయి. తాజాగా సీసీరోడ్డు నిర్మాణ పనులతో రోడ్డు మరింత ఎత్తు పెరిగి పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు నాయకులకు విన్నవించినా శాశ్వత పరిష్కారం చూపలేదని వాపోతున్నారు.

మండలంలో పల్లం ప్రాంతాలైన సీతానగరం, వెంకుపాలెం, కుంచంగి, తగరంపూడి గ్రామాల్లో చెరకు, వరి సాగు చేస్తుంటారు. శారదానది పరివాహక ప్రాంతాలుగా ఉన్న ఈ గ్రామాల్లో ఏటా ముందుగానే వరినాట్లు పడతాయి. ఈ ఏడాది కూడా వరినాట్లు దాదాపు పూర్తయ్యాయి. తీవ్ర వర్షాలు కారణంగా ఆయా గ్రామాల గుండా పారే ఎదుర్ల గెడ్డ ఉధృతికి మండలంలో మొదటిగా ఈ గ్రామాల్లో పంటలు ముంపునకు గురవుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు సమస్య మరింతగా రైతులను వేధిస్తోంది.

వ్యతిరేకిస్తున్న రైతులు

సీసీ రోడ్డు ఏర్పాటుతో పంటలు మరింత ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, వెంకుపాలెం నుంచి కుంచంగి రోడ్డు అభివృద్ధి కోసం నాబార్డు నిధులతో చేపట్టే రోడ్డు యథావిధిగా నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక చేశారు. ఎటువంటి మార్పులు లేకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డుపై సీసీ రోడ్డు వేసి మరింత ఎత్తు చేయనున్నారు. దీనిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే ఉన్న రోడ్డు కారణంగానే ఏటా వర్షాలప్పుడు మూడు గ్రామాల పంటలు నీట మునిగిపోతున్నాయని, వ్యవసాయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రణాళికలో మార్పులు చేయాలని కోరుతున్నారు.



వెంకుపాలెం కొవ్వ బ్రిడ్జి వద్ద నిరంతరం పారుతున్న వర్షపునీరు

వెంకుపాలెంలో కొవ్వ బ్రిడ్జి వద్ద 200 మీటర్ల పొడవున నాలుగు అడుగుల లోతు చేసి రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్‌లో ఎటువంటి ముంపు సమస్య ఉండదు. అయితే రోడ్డు ఎత్తు చేయకపోతే వర్షపు నీరు నిలిచిపోయి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్నాయి. దీనిపై వ్యవసాయ, పంచాయతీ రాజ్ అధికారులు సమష్టిగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది.

కొవ్వ బ్రిడ్జి వద్ద ఏటా తప్పని ముంపు....

మండలంలో వెంకుపాలెం నుంచి కుంచంగి ప్రధాన రహదారి పూర్తిగా పొలాల మధ్య నుంచి విస్తరించి ఎదుర్ల గెడ్డ మీదుగా ఉంది. రోడ్డు శిథిలమైనప్పుడల్లా అభివృద్ధి చేస్తూ సిమెంట్ రోడ్డు వేయడంతో ఎత్తు పెరిగి పొలాల్లో నీరు నిలిచిపోతోంది. ఈ సమస్యకు పరిష్కారం కోసం ఏళ్ల తరబడి రైతులు మొరపెట్టుకుంటున్నారు. మరలా ఇటీవల అదే రోడ్డు అభివృద్ధి చేస్తూ సీసీ రోడ్డు వేస్తే మరింత ఎత్తు పెరిగి పొలాల్లో పంటలు మరింత ముంపునకు గురయ్యే అవకాశముంది.



వెంకుపాలెం - కుంచంగి రోడ్డులో పనులు

మరింత ముంపు తప్పదు



కొవ్వ బ్రిడ్జి వద్ద ఏటా పొలాలు మునిగిపోతూనే ఉన్నాయి. నేను 1.5 ఎకరాల వరి సాగు చేస్తున్నాను. రెండేళ్ల క్రితం వచ్చిన తుఫాన్‌తో ఎగువ నీరంతా వచ్చి మా పొలాలను వారం రోజుల పాటు పూర్తిగా ముంచేశాయి. నీటిలోనే పంట కుళ్లిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించినప్పటికి ముంపు సమస్యకు పరిష్కారం మాత్రం చూపలేకపోతున్నారు. ఇప్పుడు అక్కడ రోడ్డు ఎత్తు చేస్తే మరింత ముంపు తప్పదు.

– రాపేటి రామారావు, రైతు. వెంకుపాలెం

రోడ్డు ఎత్తు తగ్గించాలి



మా పొలాలు ముంపునకు గురైనప్పుడల్లా అధికారులు, నాయకులు పరిశీలించి పోవడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. రోడ్డు ఎత్తు తగ్గించి ఎదురుగెడ్డ చదును చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మళ్లీ రోడ్డు పనులు చేసి ఎత్తు చేస్తే వరి పంట ఇంకా మునిగిపోతుంది. కొవ్వ బ్రిడ్జి వద్ద రోడ్డు ఎత్తు నాలుగు అడుగులు తగ్గించి సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నాం.

– రాపేటి వెంకట అప్పారావు, రైతు, వెంకుపాలెం



మహిషాసుర మర్దిని అవతారంలో కామాక్షిదేవి



నవదుర్గా అవతారంలో కన్యకాపరమేశ్వరి



మహిషాసుర మర్దిని అవతారంలో గౌరీదేవి



కశింకోట శివాలయంలో దుర్గాదేవిగా సర్వమంగళాంబ

నవదుర్గా స్తుతి

అనకాపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం దుర్గాదేవి అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారు.. దుర్గాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి, మళ్ల జగ్గాప్పారావు, మోహినీదేవి దంపతులు ఆర్థిక సహాయంతో 9 వేల మంది ముత్తయిదువులకు వాయినాలు అందజేశారు. స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు ఇంటి వద్ద తమారు చేసిన వివిధ రకాలైన పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు నవదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నూకాంబిక ఆలయంలో...

స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ మండపంలో స్వర్ణ హస్తాకంకణ సన్మాన గ్రహీత డాక్టర్ సప్నా భారతి భాగవతార్ అమ్మవారి జీవిత చరిత్ర హరికథా గానం చేశారు. అమ్మవారికి రాత్రి ఊంజల్ సేవ చేపట్టారు. స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీదేవి మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సత్యనారాయణపురం కొండపై కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నర్సింగరావుపేటలో దుర్గాలాడ్జీ వీధిలో కనకదుర్గమ్మ మందిరాన్ని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కశింకోట: స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గజమాల, ఆభరణాలతో దుర్గాదేవిగా అలంకరించారు. సీఐ అల్లు స్వామినాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో సాదరంగా ఆహ్వానించి అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను దుర్గాదేవిగా ఆభరణాలు, పూల మాలలు, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. నరసింగబిల్లిలో దుర్గాదేవి విగ్రహం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ముత్తయిదువులకు వాయినాలు అందిస్తున్న ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు



సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద వాయినాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు



నర్సింగరావుపేటలో కనకదుర్గమ్మను దర్శించుకున్న వార్డు కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులు, జాజుల రమేష్



అర్చకునికి నాణేల దండను అందజేస్తున్న ఆలయ చైర్మన్ కోటిపల్లి కిషోర్



అమ్మవారిని దర్శించుకుంటున్న సీఐ అల్లు స్వామినాయుడు దంపతులు



నూకాంబిక అమ్మవారి ఆలయంలో హరికథా గానం

వర్షం కుమ్మేసింది

కశింకోట: ఉరుములు, మెరుపులతో మంగళవారం కశింకోటలో వర్షం కుమ్మేసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపై పారింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం, పీహెచ్‌సీ, పశువుల ఆస్పత్రులకు వెళ్లే రోడ్లలో నీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. భవానీ కాలనీ, ఇందిరా కాలనీ, స్టేట్ బ్యాంకు రోడ్డు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారి రెండు వైపులా దారి పొడవునా పలుచోట్ల నీరు పారడంతో వాహన చోదకులు ఇబ్బందికి గురయ్యారు. ఇటీవల కాలంలో ఇదే భారీ వర్షం కావడంతో పొలాల్లో నీరు చేరింది. ఖరీఫ్ వరి, చెరకు పంటలకు వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కశింకోట వద్ద పొలం మడిలో చేరిన వర్షం నీరు

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు

అనకాపల్లి: వరిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున సిఫార్సు మేరకు ఎరువులు వేసుకోవాలని, గట్టపైనున్న కలుపు తీసివేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పొడతెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో ఆకు ఎండు తెగులు 5 శాతం కంటే ఎక్కువైతే నత్రజని వేయడం తాత్కాలికంగా నిలుపు చేయాలని, తెగులు ఆశించిన పొలంలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా బయటికి పంపాలని సూచించారు. ప్లాంటామైసిన్ 1 గ్రా. కోసైడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఉల్లికోడు ఆశించినట్లయితే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున 20 కిలోల ఇసుకలో కలిపి పొలంలో పలచగా నీరు ఉంచి వేసుకోవాలన్నారు. వరిలో సుడిదోమ నివారణకు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రా. ల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు నివారణకు పిలకలదశలో క్లోరిఫైరిపాస్ 20ఈ.సీ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కందిపైరులో ఆకుచుట్టు ఆశించే అవకాశం ఉందని, క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకులో పేను బంక పురుగుల నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ , 5 గ్రా. మల్టికెను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చన్నారు. ఎకరానికి 35 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.వి.రమణమూర్తి, ఉమామహేశ్వరరావు, ఆదిలక్ష్మి, వి.గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న దళితులు, సీపీఎం నాయకులు

రావికమతం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన, హైస్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను తక్షణం తొలగించాలని డిమాండ్‌చేస్తూ సమీపంలో గల అంబేడ్కర్ కాలనీ వాసులు, సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. తహసీల్దార్ కార్యాలయం, మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఉన్న చెత్తను తొలగించాలని ఎంపీడీవో,తహసీల్దార్‌లకు పలు మార్లు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని వారు తెలిపారు. చెత్త కారణంగా కాలనీలో 50 కుటుంబాలకు చెందిన 250మంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇక్కడ చెత్త వేస్తున్నారని వారు చెప్పారు. దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే బీఎన్ రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తామని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చేవ్వేటి సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు, స్థానికులు వాలిశెట్టి రాజులమ్మ,బుడతల సత్యవతి తదితరులు తెలిపారు.

జోరుగా నాటుకోళ్ల విక్రయాలు

మాకవరపాలెం: దసరా పండగ నేపథ్యంలో స్థానిక వారపు సంతలో నాటుకోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. మంగళవారం జరిగిన వారపు సంతలో విక్రయించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికంగా తీసుకువచ్చారు. దసరా పండగ సందర్భంగా స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. రూ.500 ధర ఉండే కోడిని రూ.1000 వరకు విక్రయించారు.



సంతలో విక్రయానికి తీసుకువచ్చిన కోళ్లు

2న జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2వ తేదీ గురువారం అప్పలరాజుపురంలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. దేవిమెట్ట మీద వెలసిన లలితాదేవి ఆలయంలో దసరా సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

అధిక లోడు వాహనానికి జరిమానా

మునగపాక: అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనానికి జరిమానా విధించినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో మునగపాక సమీపంలో మంగళవారం రాత్రి అధిక లోడుతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే వాహనాన్ని ఆపి రూ.67 వేలు జరిమానా విధించారు.

కుగ్రామం నుంచి ఆరుగురికి ప్రభుత్వ కొలువు



పి.కె.పల్లిలో కొత్తగా ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న గ్రామస్తులు

కోటవురట్ల: తమ గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రభుత్వ శాఖల్లోని వివిధ ఉద్యోగాలు సాధించడంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పి.కె.పల్లికి చెందిన ఎస్.నరసింహమూర్తి, ఆర్.దేవుడునాయుడు, ఎస్.నాగేశ్వరరావు ఇటీవల మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎస్.అక్షిత, వై.రాజుబాబు, ఆర్.శివరామ్ వేర్వేరు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. దాంతో గ్రామానికి చెందిన రొంగల రామకృష్ణ, రొంగల నారాయణమూర్తి, గ్రామ పెద్దలు, యువకులు ఉద్యోగాలు సాధించిన ఆరుగురిని మంగళవారం ఘనంగా సత్కరించారు. వీరితో పాటు అదే గ్రామంలో ఉద్యోగాలు చేసి వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన మరో ఇద్దరికి కూడా సన్మానం చేశారు.

హింస వద్దే వద్దు

కె.కోటపాడు : విజయదశమి పర్వదినం, గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం సందేశాత్మక ప్రదర్శనను ఇచ్చారు. శ్రీరాముడు, గాంధీ జీ వేషధారణలతో హింస వద్దు, ధర్మమే విజయం, సత్యమే శాశ్వతం, అహింసే మార్గం అంటూ ప్రదర్శన ఇచ్చారు.



గాంధీజీ, శ్రీరాముని వేషధారణలో విద్యార్థులు

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు పాలక వర్గం కృషి చేస్తుందని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూకనరసింగరావు అన్నారు. సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలన్నారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో మునగపాక సహకార సంస్థ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్ల సేకరణ, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయంతో పాటు సొసైటీ ద్వారా రేషన్ సరకుల బట్వాడా వంటి సేవలు అందిస్తున్నామన్నారు. సంఘ సీఈవో పెంటకోట మహేష్ సంఘ నివేదికను చదివి వినిపించారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, కోనపల్లి రామ్మోహనరావు, సంఘ పర్సన్లు మొల్లి అప్పలరాజు, పాలిపిని రామారావు, నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కరరావు, పలువురు రైతులు, సొసైటీ సిబ్బంది, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.